


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 09-02-2025 | సంపుటి - 21 | సంచిక -292 | రూ : 4 | పేజీలు: 8




# దిల్లీ ముఖ్యమంత్రి ఎవరు?..

## రేసులో పర్వేశ్ వర్మ ముందంజ!

దిల్లీ: ముఖ్యమంత్రిగా భాజపా ఎవరిని ఎంపిక చేస్తుందనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం అభ్యర్థిగా కమలం పార్టీ ఎవరినీ ప్రకటించకపోవడం, రాష్ట్ర ప్రభుత్వాధినేతల విషయంలో అగ్రనాయకత్వం అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్న పరిస్థితుల్లో దిల్లీ పాలనాపగ్గాలు ఎవరికి దక్కుతాయనే అంశంపై ఊహాగానాలు జోరుగా కొనసాగుతున్నాయి. కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది.

**పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ**

న్యూదిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌పై విజయం సాధించి జెయింట్ కిల్లర్‌గా నిలిచిన పర్వేశ్‌కు భాజపా అగ్రనాయకత్వం రిటర్న్ గిఫ్ట్‌గా ముఖ్యమంత్రి పదవి ఇస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో గట్టిగా వ్యక్తమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడైన పర్వేశ్ వర్మ... 2014 నుంచి 2024 వరకు పశ్చిమ దిల్లీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌కు దీటైన అభ్యర్థి కోసం భారీ కసరత్తు చేసిన భాజపా చివరకు వర్మను రంగంలోకి దించింది. పార్టీ నమ్మకాన్ని పర్వేశ్ వర్మ నిలబెట్టుకున్నారు.

**రమేశ్ బిధూడీ**

భాజపాలో ఫైర్ బ్రాండ్ నేతల్లో ఒకరిగా రమేశ్ బిధూడీకి పేరుంది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఆతిశీ (ఆప్) పోటీ చేసిన కాల్‌కాజీ స్థానంలో పార్టీ ఆయనను బరిలోకి దింపటం చర్చనీయాంశమైంది. ఆయన

తరువాయి 2లో

# దిల్లీ కోటపై కాషాయ జెండా

- 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారంలోకి భాజపా
- అసెంబ్లీ ఎన్నికల్లో 48 స్థానాలతో ఘన విజయం
- 22తో సరిపెట్టుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- కేజ్రీవాల్ సహా ప్రముఖుల పరాజయం
- అతి కష్టమ్మీద గట్టెక్కిన సీఎం ఆతిశీ
- ఉనికి కోల్పోయిన కాంగ్రెస్.. మూడోసారీ సున్నా
- కేజ్రీని ఓడించిన పర్వేశ్ వర్మే నూతన సీఎం?

2లో



# రూ.3 వేల కోట్ల పనులకు

## నెలాఖరులోపు కార్యాచరణ

- మీరాలం చెరువుపై వంతెనను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాజెక్టులపై సమీక్ష

2లో



# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు

- ఇప్పటికే 71,482 మంది ఎంపిక
- తర్వాత దశలోనూ ఎల్-1, ఎల్-2 జాబితాలకే ప్రాధాన్యం?

2లో



# అమెరికాను వణికిస్తున్న 'ఫ్లూ సీజన్'

- 43 రాష్ట్రాల్లో గరిష్ఠ సంఖ్యలో బాధితులు
- ఈ శీతాకాలంలోనే 13 వేల మరణాలు

2లో



# ఇప్పుడు దేశానికి కావాల్సింది..

## మోదీ నమూనానే!

- సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వంతోనే అభివృద్ధి
- ఆప్, వైకాపాలది ఒకే విధానం: ముఖ్యమంత్రి చంద్రబాబు
- దిల్లీలో భాజపా విజయంపై ప్రధాని మోదీకి అభినందనలు



అమరావతి: దేశంలో, రాష్ట్రంలో దృఢమైన ప్రభుత్వాలు ఉండి, సరైన సమయంలో, సరైన నాయకుడి సారథ్యంలో పరిపాలన స్థిరంగా కొనసాగితేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎవరికి ఇష్టమున్నా లేకపోయినా, భారత్‌కు ఈ సమయంలో సరైన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని, ఆయన అనుసరిస్తున్న అభివృద్ధి నమూనానే దేశానికి కావాలని పేర్కొన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలోని ఎన్డీయేకు ప్రజలు అద్భుత విజయాన్ని కట్టబెట్టారంటూ.. ప్రధానికి అభినందనలు తెలిపారు. దిల్లీలో ఆప్, ఏపీలో వైకాపా ప్రభుత్వాలు అనుసరించిన విధానాల్లో చాలా పోలికలున్నాయని, అవి ఘోరంగా విఫలమయ్యాయని, అందుకే ప్రజలు వారిని తిరస్కరించారని పేర్కొన్నారు. శనివారం ఉండవల్లిలోని నివాసంలో విలేకరుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. గుజరాత్‌లో మోదీ నిర్మించిన పునాదులపై భాజపా ఐదు సార్లు వరుసగా

తరువాయి 2లో

# తానోడి..

## ఆప్‌ను ఓడించి..!

- దిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం

దిల్లీ శాసనసభ ఎన్నికల్లో దాదాపు ఆరుశాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క స్థానంలోనూ నెగ్గలేదు. ఎంత ఘోరంగా ఓడిందంటే చాలా చోట్ల ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. కొన్ని చోట్లయితే నాలుగో స్థానానికి పడిపోయింది. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విజయావకాశాలనూ తీవ్రంగా ప్రభావితం చేసింది. ఒక రకంగా భాజపా నెగ్గడానికి కాంగ్రెస్ కూడా కారణమైందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ తాను ఓడటమే కాదు.. ఆ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీనీ కోలుకోలేని దెబ్బ తీసింది. ఓట్లను చీల్చి చాలా స్థానాల్లో ఫలితాలను తారుమారు

తరువాయి 2లో



# కరేబియన్ సముద్రంలో భారీ భూకంపం

కరేబియన్ సముద్రంలో భారీ భూకంపం సంభవించింది. హోండురస్‌కు ఉత్తరాన రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 7.6గా నమోదైంది. కొలంబియా, కోస్టారికా, నికరగువా, క్యూబా దేశాలపై దీని ప్రభావం కనిపించింది. అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ప్రధాన భూభాగంపై దీని ప్రభావం ఉండదని పేర్కొంది. క్యూబా తీరంలోని కొన్ని ప్రాంతాల్లో 1-3 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది



# దిల్లీ కోటపై కాషాయ జెండా



దిల్లీ: 'మోదీ గ్యారంటీ' ఫలించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమయ్యాయి. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చినా దిల్లీ శాసనసభలో మాత్రం అధికారం దక్కడం లేదనే కమలనాథుల వ్యథ తీరిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో దిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ విజయదుందుభి మోగించిన భాజపా ఇప్పుడు అసెంబ్లీలో పాగా వేసింది. ఇతర ఏ పక్షాలకూ తావులేకుండా ముఖాముఖి సాగిన పోరులో 70 అసెంబ్లీ స్థానాలకు గానూ 48 చోట్ల భాజపా అభ్యర్థులు విజయం సాధించి గెలుపు బావుటా ఎగరేశారు. ఆప్ నేతలపై వచ్చిన ఆరోపణలు, ఇటీవలి కేంద్ర బడ్జెట్లో వేతన జీవులకు ప్రకటించిన ఆదాయపు పన్ను వరాలు, దిల్లీ అభివృద్ధికి ప్రధాని మోదీ స్వయంగా ఇచ్చిన హామీలు.. ఇలాంటివన్నీ ఓటర్ల మది దోచుకున్నాయి. ఆ దెబ్బకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా ఆ పార్టీ సీనియర్ నేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్, సోమనాథ్ భారతి, సౌరభ్ భరద్వాజ్ వంటివారంతా పరాజితులుగా మిగిలిపోవాల్సి వచ్చింది. ఆప్ 12 ఏళ్ల పాలనకు తెరపడింది.

**గట్టెక్కిన ఆతిశీ**

ఈ ఎన్నికల్లో ఆప్ నేత, ముఖ్యమంత్రి ఆతిశీ మాత్రం (కల్కాజీ నియోజకవర్గం) గెలుపొందారు. ఒకదశలో వెనుకంజలో ఉన్న ఆమె.. ఆ తర్వాత పుంజుకుని భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు. దిల్లీని 15 ఏళ్లపాటు ఏలిన కాంగ్రెస్ పార్టీ కనీసం ఒక్కచోటైనా బోణీ కొట్టలేకపోయింది. ఆ పార్టీ తరఫున బరిలో దిగిన సందీప్ దీక్షిత్ (మాజీ సీఎం షీలా దీక్షిత్ తనయుడు), అల్కా లాంబా వంటివారంతా ఓడిపోయారు. న్యూదిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌ను 4,089 ఓట్ల తేడాతో ఓడించిన భాజపా నేత, మాజీ ముఖ్యమంత్రి సాహిబ్‌సింగ్ వర్మ తనయుడు పర్వేశ్ వర్మ నూతన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేజ్రీవాల్‌కు 25,999 ఓట్లు, వర్మకు 30,088 ఓట్లు వచ్చాయి. దిల్లీ ఎన్నికల్లో విజయం ప్రధాని మోదీకి, దిల్లీ ప్రజలకు చెందుతుందని వర్మ చెప్పారు. 2013లో అసెంబ్లీకి, ఆ తర్వాత 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ దిల్లీ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన జాట్ల నేత వర్మ.. ఈసారి అసెంబ్లీ సమరంలో భాజపా అధికారికంగా తన పేరు ప్రకటించడానికి చాలాముందుగానే ప్రచారం ప్రారంభించారు.

**భాజపా విజయ దుందుభి**

సీఎం అభ్యర్థిని ప్రకటించకుండా కమలనాథులు ఈసారి ఎన్నికల బరిలో దిగారు. ఉదయం ఫలితాల సరళి వెలువడటం ప్రారంభమైనప్పటి నుంచి అంతా ఏకపక్షంగా, భాజపాకు అనుకూలంగా రావడం మొదలైంది. జయాపజయాలు దోబూచులాడిన న్యూదిల్లీ అసెంబ్లీ స్థానంలో కేజ్రీవాల్ చివరకు 4,089 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. జంగ్‌పురలో భాజపా అభ్యర్థి తర్వీందర్‌సింగ్ చేతిలో మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా 675 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. షాకుర్ బస్తీలో సత్యేందర్ జైన్ 19వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆప్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న గోపాల్‌రాయ్ (మెజార్టీ 18,994), ముకేశ్ అహ్లావత్ (మెజార్టీ 17,126), ఇమ్రాన్ హుస్సేన్ (మెజార్టీ 29,823)లు నెగ్గి పార్టీ పరువు నిలబెట్టారు.

**కాంగ్రెస్‌కు మూడోసారి ఓటమి**

భాజపా అభ్యర్థి చందన్‌కుమార్ చౌధరి కేవలం 344 ఓట్ల తేడాతో సంగమ్‌విహార్ నుంచి నెగ్గారు. ఈ ఎన్నికలతో కలిపి కాంగ్రెస్ పార్టీకి వరసగా మూడు అసెంబ్లీ సమరాల్లో ఓటమి మిగిలినట్లయింది. ఒక్కటంటే ఒక్కస్థానం కూడా ఆ పార్టీకి దక్కలేదు. ఆప్‌ను ఆప్‌ద (విపత్తు)గా పేర్కొనడం, దిల్లీలో తీవ్ర కాలుష్యం సహా పౌర సమస్యలు, కేజ్రీవాల్ నివాస భవంతిని అద్దాలమేడగా చూపించడం, ఎక్సైజ్ విధానంలో అవినీతి వంటివి ఓటర్లపై గట్టి ప్రభావం చూపాయని భావిస్తున్నారు. ఫలితాలు వెల్లడయ్యాక ఆప్, కాంగ్రెస్ కార్యాలయాలు కళతప్పి కనిపించగా భాజపా కార్యాలయంలో సంబరాలు మిన్నంటాయి. పార్టీ కార్యకర్తల్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. సీఎం అభ్యర్థిని కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని పర్వేశ్ వర్మ సహా భాజపా నేతలంతా చెబుతున్నారు. వర్మకే అవకాశమిస్తారా, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పూర్తిగా కొత్తవ్యక్తిని తెరపైకి తెస్తారా అనేది తేలాల్సి ఉంది.

# ఇప్పుడు దేశానికి కావాల్సింది.. మోదీ నమూనానే!

(మొదటిపేజీ తరువాయి)

గెలవడం వల్లే.. ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పటి నుంచి జీఎస్‌డీపీలో ఆ రాష్ట్రం 15 రెట్లు వృద్ధి సాధించిందని గుర్తుచేశారు. 1995 నుంచి 2004 వరకు వివిధ రాష్ట్రాల్లో జీఎస్‌డీపీ వృద్ధి రేటును చంద్రబాబు విశ్లేషించారు. 2019లో తెదేపా గెలిచి ఉంటే, ఏపీ గుజరాత్ కంటే ముందుగానీ, దానితో సమానంగా గానీ ఉండేదన్నారు. 'ప్రజలే ముందు అన్నదే సుస్థిర విధానం' అని తెలిపారు.

**బటన్ నొక్కుతూ.. మాయమాటలు**

'సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతున్నామంటూ మాయమాటలు చెప్పి, ఆ ముసుగులో అవినీతికి పాల్పడటం, ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగడం, అక్రమ అరెస్టులు, సామాజిక మాధ్యమాల్లో దూషించడం, గర్వం తలకెక్కించుకోవడాన్ని ప్రజలు సహించరు. ఈ విషయాల్లో వైకాపా, ఆప్ ప్రభుత్వాల మధ్య చాలా పోలికలున్నాయి. ఆ రెండు పార్టీల నాయకుల్లో అణకువ లేదు. పనిచేసే సత్తా లేదు. దిల్లీలో విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చామన్నారు. కానీ ఉన్నత విద్యను భ్రష్టు పట్టించారు. కాలేజీల్లేవు. ఉద్యోగాల్లేవు. మొహల్లా ఆస్పత్రులతో ఇంటింటికీ మందులు పంపుతున్నామన్నారు. కానీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లేవు. పరిశుభ్రమైన నీళ్లిచ్చే పరిస్థితి లేదు. మురుగు నీరు, మంచినీరు కలిసిపోతోంది. వివిధ దేశాధినేతలు, రాయబారులు వెళ్లే ప్రధాన రహదారుల్లోనూ చెత్తే. యమునా నది కలుషితమైపోయింది. దిల్లీ అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా నిలిచింది' అని చంద్రబాబు విమర్శించారు.

**ప్రజల సొమ్ముతో ప్యాలెస్‌లా?**

'రుషికొండపై జగన్ విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టి పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారు. దిల్లీలోనూ కేజ్రీవాల్ శీష్‌మహల్ కట్టుకున్నారు. అక్కడా, ఇక్కడా ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు వాటిలోకి వెళ్లకముందే ప్రజలు తగిన శాస్తి చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగాలు కోరుకున్న ప్రజల ఆకాంక్షలు ఆవిరైపోయాయి. దిల్లీలో ఆప్, ఏపీలో వైకాపా ప్రభుత్వాలు ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్తుని కాటేశాయి' అని చంద్రబాబు పోల్చి విమర్శించారు. వైకాపా నాయకులు ఏపీలో చేసిన మద్యం కుంభకోణంతో పోలిస్తే దిల్లీలో జరిగింది పదో వంతు కూడా కాదన్నారు. మద్యం కుంభకోణంపై చర్యల్లో వేగం లోపించిందన్న ప్రశ్నకు.. 'హడావుడిగా చేసేసి నిందితులు తప్పించుకుపోయే అవకాశమివ్వడం మా లక్ష్యం కాదు. పద్ధతి ప్రకారమే జరుగుతుంది. నేను జోక్యం చేసుకోను. చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని సీఎం వ్యాఖ్యానించారు.

**ఫైళ్ల క్లియరెన్స్‌పై దుష్ట రాజకీయమా?**

మంత్రుల దగ్గరకు వచ్చిన దస్త్రాలను పరిష్కరించడానికి ఒక్కొక్కరు ఎంత సమయం తీసుకున్నారో చెప్పి, వేగంగా చేయాలని క్యాబినెట్ సమావేశంలో సూచిస్తే.. దానికి కొన్ని దుష్టశక్తులు వక్రభాష్యం చెబుతున్నాయని సీఎం ఆక్షేపించారు. 'మంత్రులు ఫైళ్లను డిస్పోజ్ చేయడానికి ఎంత సమయం తీసుకుంటున్నారో చెప్పానే తప్ప, అది వారి సమర్థతను బేరీజు వేయడం కాదు. కొందరి శాఖల్ని బట్టి ఎక్కువ ఫైళ్లు వస్తాయి. మున్ముందు జీఎస్‌డీపీ, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌లోనూ పోటీ పెడతాను. ప్రజలు నన్ను నమ్మి ఓటేసినప్పుడు నా బృందంతో సమర్థంగా పని చేయించడం నా బాధ్యత' అని చంద్రబాబు తెలిపారు.

**అందుకే దిల్లీలో గర్వభంగం**

జగన్ 2.0 అంటున్నారని, 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటానని చెబుతున్నారని విలేకరులు ప్రస్తావించగా, 'దిల్లీలో అలా అంటేనే కదా గర్వభంగమైంది? ఇలాంటి మోదీలు ఎందరొచ్చినా ఓడించలేరన్న ఆప్ నాయకుల పరిస్థితేంటో చూస్తున్నాం' అని చంద్రబాబు బదులిచ్చారు. తానెప్పుడూ సిద్ధాంతపరంగా నడుచుకున్నానే తప్ప, వ్యక్తిగత, కక్షపూరిత రాజకీయాలు చేయలేదన్నారు. ఫ్యాక్షన్, మతతత్వ శక్తులు, నక్సలైట్లు, రౌడీలు, గూండాలను అణచివేశామని చెప్పిన సీఎం.. గంజాయి సాగు చేసినా, ఆడబిడ్డల జోలికెళ్లినా వారికదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు.

*** దిల్లీలో తొలగిన రాజకీయ కాలుష్యం: పెమ్మసాని**

దిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమితో రాజకీయ కాలుష్యం పోయిందని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. అవినీతిని నిర్మూలిస్తామని అధికారంలోకి వచ్చిన ఆప్ సర్కారుకు అవినీతి మరక అంటడంతో పాటు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, చంద్రబాబు ప్రచారం కూడా భాజపా విజయానికి కలిసొచ్చాయని వెల్లడించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అరవింద్ కేజ్రీవాల్ అభివృద్ధిని పట్టించుకోలేదు. దిల్లీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇళ్లలోంచి చెత్త తీసుకెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. జనాభా పెరుగుతుంటే, తదనుగుణంగా తాగునీటి సదుపాయం, మురుగునీటి పారుదల వ్యవస్థలు మెరుగుపరచలేదు' అని పెమ్మసాని విమర్శించారు.

## అమెరికాను వణికిస్తున్న 'ఫ్లూ సీజన్'




న్యూయార్క్: అమెరికాలో ప్రస్తుత 'ఫ్లూ సీజన్' ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ, నైరుతి, దక్షిణ రాష్ట్రాల్లో ఈ శీతాకాలంలో(వింటర్ వైరస్ సీజన్, ఫ్లూ సీజన్) రికార్డు స్థాయిలో ఫ్లూ రుగ్మతలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు శుక్రవారం ఇక్కడి ఆసుపత్రి సమాచార వర్గాలతో పాటు సీడీసీ (సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్) అంచనాలు వెల్లడించాయి. మొత్తం 43 రాష్ట్రాల్లో గరిష్ఠ సంఖ్యలో బాధితులు ఉన్నారని, ఎక్కువమంది శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర ఫ్లూ రుగ్మతల బారిన పడుతున్నారని, సాధారణంగా శీతాకాలంలో నమోదయ్యే గరిష్ఠ స్థాయిని మించి ప్రస్తుతం కేసుల సంఖ్య ఉన్నట్లు పేర్కొన్నాయి. సీడీసీ గణాంకాల ప్రకారం ఈ సీజన్‌లో సుమారు 2.4 కోట్లమంది ఫ్లూ వైరస్‌ల బారిన పడగా, 3.1 లక్షల మంది ఆసుపత్రుల పాలయ్యారు. 13 వేల మరణాలు సంభవించాయి. మృతుల్లో 57 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో కోవిడ్ 19 ఉన్న చిన్నారులు సైతం అధిక సంఖ్యలో ఉన్నట్లు ఇక్కడి వైద్యులు చెబుతున్నారు. ఆరు నెలలు అంతకంటే ఎక్కువ వయసున్న ప్రతి ఒక్కరూ వార్షిక ఫ్లూ టీకాను పొందాలని, సీజనల్ వైరస్‌లను నివారించడానికి సంబంధిత నిబంధనలను తప్పక పాటించాలని అమెరికా ఆరోగ్య అధికారులు సూచిస్తున్నారు.



## దిల్లీలో 'ఎగ్జిట్ పోల్స్' రైట్ రైట్

దిల్లీ: ఏ ఎన్నికలు జరిగినా ఎగ్జిట్ పోల్స్ కోసం అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. సర్వే సంస్థలు విడుదల చేసే అంచనా ఫలితాలను చాలా మంది నమ్ముతుంటారు. ఒక్కోసారి ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు, వాస్తవ ఎన్నికల ఫలితాలకు పెద్దగా తేడా ఉండదు. కొన్ని సందర్భాల్లో మాత్రం ఈ లెక్కలు తప్పుతుంటాయి. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో దాదాపుగా ఎగ్జిట్ పోల్స్ చెప్పినట్లే ఫలితాలు వెలువడ్డాయి.

**ఆ సంస్థల లెక్క ఓకే**

భాజపాకు 40 నుంచి 55 సీట్లు రావచ్చని యాక్సిస్ మై ఇండియా సంస్థ అంచనా వేసింది. ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) 15 నుంచి 25 సీట్లకే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. కాంగ్రెస్ 1 సీటుకే పరిమితం కావచ్చని తెలిపింది. టుడేస్ చాణక్య సైతం అచ్చం ఇదే తరహా అంచనాలను వెలువరించింది. భాజపాకు 4557, ఆప్‌నకు 1325 సీట్లు రావొచ్చని జోస్యం చెప్పింది. చాణక్య స్ట్రాటజీస్ పేరుతో వెలువడిన నివేదికతో తమకు సంబంధం లేదని టుడేస్ చాణక్య స్పష్టం చేసింది. భాజపాకు 35 నుంచి 40 సీట్లు, ఆప్‌నకు 32 నుంచి 37 సీట్లు, కాంగ్రెస్‌కు 1 సీటు రావొచ్చని మ్యాట్రిజ్ అంచనా వేసింది. వీటితోపాటు మరికొన్ని సంస్థలు సైతం భాజపాదే విజయమని పేర్కొన్నాయి. మరోవైపు, శనివారం వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో భాజపాకు 48 స్థానాలు లభించగా, ఆమ్ ఆద్మీ పార్టీ 22 స్థానాలకు పరిమితమైంది.

## దిల్లీ ముఖ్యమంత్రి ఎవరు?.. రేసులో పర్వేశ్ వర్మ ముందంజ!

(మొదటిపేజీ తరువాయి)

ఆతిశీపై స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ భాజపా అగ్రనాయకత్వం రమేశ్ బిధూడీ పేరునూ సీఎం పదవి కోసం పరిశీలించే అవకాశం ఉంది. దిల్లీ భాజపా మాజీ అధ్యక్షులైన విజేందర్ గుప్తా, సతీశ్ ఉపాధ్యాయ్ పేర్లూ సీఎం పదవికి వినిపిస్తున్నాయి. భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ, జాతీయ కార్యదర్శి దుశ్యంత్ గౌతమ్, ఎంపీ మనోజ్ తివారీ, సీనియర్ నేతలు కపిల్ మిశ్ర, అర్విందర్ సింగ్ లవ్లీతో పాటు వ్యాపార వర్గానికి చెందిన జితేంద్ర మహాజన్ పేర్లు సీఎం రేసులో వినిపిస్తున్నాయి. దివంగత నేత, దిల్లీ మాజీ సీఎం సుష్మా స్వరాజ్ కుమార్తె అయిన బాంసురీ స్వరాజ్ గతేడాది న్యూదిల్లీ లోక్‌సభ స్థానం నుంచి గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. బాంసురీతో పాటు మాజీ ఎంపీ స్మృతీ ఇరానీ పేరు కూడా సీఎం పదవికి వినిపిస్తోంది.

## రూ.3 వేల కోట్ల పనులకు నెలాఖరులోపు కార్యాచరణ

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.3 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చేపడుతున్న పలు ప్రాజెక్టులపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. మీరాలం చెరువుపై 2.4 కిలోమీటర్ల మేర వంతెన నిర్మాణానికి అధికారులు... రూ.375 కోట్లు, రూ.1,200 కోట్లు, రూ.1,900 కోట్ల అంచనా వ్యయాలతో మూడు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. వాటిలో ఉత్తమమైన దాన్ని ఎంపిక చేసే విషయంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశంపై సీఎం పలు సూచనలు చేశారు. 90 రోజుల్లోగా డీపీఆర్‌ను రూపొందించాలని, 30 నెలల్లోపు వంతెన నిర్మించాలని ఆదేశించారు. చిన్నపిల్లలను దృష్టిలో ఉంచుకొని వంతెన పరిసరాలను రూపొందించాలన్నారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న కొత్త ఫ్లైఓవర్ల గురించీ ముఖ్యమంత్రి సమీక్షించారు. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో రూ.1,100 కోట్లతో నిర్మించతలపెట్టిన ఫ్లైఓవర్లు, భూగర్భ మార్గాలకు రూపొందించిన డీపీఆర్‌లలో తలెత్తిన సాంకేతిక సమస్యలను తొందరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట, హఫీజ్‌బాబానగర్, శాస్త్రిపురం, బాలాపూర్‌లతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నం.12 మార్గం విస్తరణకు అవసరమైన ప్రణాళికలు త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆయా పనులన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారంతో రెండు రోజుల్లో రావాలని అధికారులకు సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్రప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్ శశాంక, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## 3 జాబితాలుగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను (పరిశీలించిన వాటిని) అధికారులు మూడు జాబితాలుగా విభజించారు. సొంత ఇంటి స్థలాలు ఉండి ఇళ్లు లేనివారిని ఎల్ 1 జాబితాలో చేర్చారు. సొంత స్థలంలో గుడిసె, పూరిపాక, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఈ జాబితాలో చేర్చారు. సొంత స్థలం లేనివారు ఎల్ 2లో ఉన్నారు. వీరంతా స్థలంతో పాటు ఎలాంటి ఇళ్లు లేనివారే. సొంత ఇల్లు ఉండీ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ 3లో చేర్చారు.

**విభజించింది ఇలా..**

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను యాప్ సర్వే, కుటుంబ సర్వే ఆధారంగా విభజించారు. దీనిప్రకారం ఎల్ 1లో 21.93 లక్షలు, ఎల్ 2లో 19.96 లక్షలు, ఎల్ 3లో 33.87 లక్షల దరఖాస్తులను చేర్చారు. జీహెచ్‌ఎంసీలో ఇంకా 2.43 లక్షల ఇళ్లను పరిశీలించాల్సి ఉంది. మొదటి విడతలో 562 గ్రామాల నుంచి 71,482 మందిని ఇందిరమ్మ లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ లబ్ధిదారుల్లో ఎల్ 1 నుంచి 59,807 మంది, ఎల్ 2 నుంచి 1,945 మంది, ఎల్ 3 నుంచి 5,732 మందిని, కొత్త దరఖాస్తుల నుంచి 3,998 మందిని ఎంపిక చేశారు. మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికే ఇళ్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులోభాగంగా ఎల్ 1 నుంచి అత్యధికంగా 59,807 మందిని ఎంపిక చేసింది. ఎల్ 2, ఎల్ 3 జాబితాలు, కొత్తగా వచ్చిన దరఖాస్తుదారుల నుంచి 11,675 మందిని ఎంపిక చేసింది. తర్వాత విడతల్లో ఎల్ 1, ఎల్ 2లోని మిగిలిన వారికే ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వనున్నారని అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. ఎల్ 3లో 33.87 లక్షల మంది లబ్ధిదారుల్లో మెజార్టీ శాతం ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

## తానోడి.. ఆప్‌ను ఓడించి..!

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. న్యూదిల్లీ నియోజకవర్గంలో భాజపా అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 4,089 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున పోటీచేసి మూడో స్థానంలో నిలిచిన సందీప్ దీక్షిత్ (దిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు)కు 4,568 ఓట్లు వచ్చాయి. ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేసి ఉంటే కేజ్రీవాల్ స్వల్ప మెజారిటీతో గట్టెక్కేవారే. దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా పోటీ చేసిన జంగపురాలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ భాజపా అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో సిసోదియా కేవలం 675 ఓట్లతో పరాజయం పాలయ్యారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఫర్హాద్ సూరికి 7,350 ఓట్లు వచ్చాయి. గ్రేటర్ కైలాస్‌లో మంత్రి సౌరభ్ భరద్వాజ్‌పై 3,188 ఓట్లతో భాజపా అభ్యర్థి షికారాయ్ విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 6,711 ఓట్లు పడ్డాయి. ఇదొక్క నియోజకవర్గమే కాదు.. రాజేందర్ నగర్, ఛతర్‌పుర్, సంగమ్ విహార్, గ్రేటర్ కైలాస్.. ఇలా 14కు పైగా స్థానాల్లో ఆప్ అవకాశాలకు కాంగ్రెస్ గండి కొట్టింది. రాజేందర్ నగర్‌లో ఆప్ 45,440 ఓట్లు సాధిస్తే, కాంగ్రెస్‌కు 4,015 ఓట్లు వచ్చాయి. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే ఆ నియోజవర్గం ఆప్ ఖాతాలో చేరేది. ఛతర్‌పుర్‌లోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, ముస్లిం ఓట్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఆప్ అవకాశాలను తీవ్రంగా ప్రభావితం చేశారు. ఇది భాజపాకు కలిసొచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ చాలా స్థానాల్లో బలమైన అభ్యర్థులనే నిలబెట్టింది. కానీ వారెవ్వరూ గట్టి పోటీ ఇవ్వలేకపోయారు. కచ్చితంగా నెగ్గుతామనుకున్న నియోజకవర్గాలన్నింటిలోనూ కాంగ్రెస్ పరిస్థితి దాదాపు ఇంతే. 2020తో పోలిస్తే ఈసారి ఓట్ల శాతం 2.1% మేర పెరగడం ఒక్కటే ఆ పార్టీకి కాస్త ఊరట.

# ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు శుభాకాంక్షల వెల్లువ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బీఆర్ఎస్ పార్టీ విప్గా నియమితులైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, నాయకులు, అభిమానులు పేట బషీరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వివిధ కాలనీలు బస్తీలు నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే కి విన్నవించుకోగా ఆయన తక్షణమే సంబంధిత అధికారులకు వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘం నాయకులు, అభిమానులు తమ ఇంట్లో జరుపుకునే శుభకార్యాలకు , ఇతర ప్రత్యేక కార్యక్రమాలకు రావాల్సిందిగా ఎమ్మెల్యే కి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ఆలయ వార్షికోత్సవం ద్వారా ప్రజలలో ఐక్యత , భక్తి భావాన్ని పెంపొందిస్తాయి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆలయ వార్షికోత్సవం ద్వారా ప్రజలలో ఐక్యత , భక్తి భావాన్ని పెంపొందిస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ లోని అమృతాలయం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమృతాలయం దేవాలయం మన ప్రాంతం యొక్క ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, నాయకులు మీసాల నరసింహ, బాపు యాదగిరి, సంజీవరెడ్డి, ఆంజనేయులు చారి, కిషోర్ చారి, బొడ్డు రవి, బాలయ్య, వనం శ్రీనివాస్, అజయ్, శ్రీనాథ్, వెంకటేష్, స్థానిక నాయకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# ఘనంగా ఎమ్మెల్యే కుంభం జన్మదిన వేడుకలు



యాదాద్రి భువనగిరి జిల్లా , ప్రజాస్ఫూర్తి : భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పుట్ట శివ యాదవ్ ఆధ్వర్యంలో తుక్కాపురం గ్రామంలో తొమ్మిదవ , పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లు, పెన్నులు అందజేశారు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ మరియు ఎంపిడిఓ కార్యాలయంలో పండ్లు పంపిణీ చేశారు. అలాగే వివిధ కూడలిలో బస్టాండ్, రైల్వే స్టేషన్, రేణుక ఎల్లమ్మ గుడి ఏరియాలలో ఆహార పోట్లలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భువనగిరి లో కార్యకర్తలతో కలిసి కుంభం జన్మదినం వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్లమాస రవి గౌడ్ , పుట్ట కృష్ణ యాదవ్, మచ్చ నవీన్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుంది

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) :అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. రాజీవ్ గాంధీ నగర్ నల్లగుట్ట పైన వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం 24వ ద్వాదశ జ్యోతిర్లింగాల శివ పూజ మహోత్సవం సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 24వ ద్వాదశ జ్యోతిర్లింగాల శివ పూజ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడు లాగానే ఈ ఏడాది కూడా శివ పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సంవత్సరం వేలాదిమంది భక్తులు ఈ మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకుంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు దుదిమెట్ల సోమేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సంజీవరెడ్డి,పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు విజయరామరెడ్డి, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్,నాయకులు ముకుందం,పిట్ల మల్లేష్,ఇమ్రాన్ బేగ్, నారాయణ, బద్రి,నాగభూషణం,అసిఫ్,జునైద్ , స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నాయకులు సభ్యులు, శివ స్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు

## ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి

# అపన్న హస్తంలా ఆదుకుంటుంది

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అపన్న హస్తంలా ఆదుకుంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరి గుట్ట డివిజన్ దేవమ్మ బస్తీకి చెందిన వై.రమేష్ , సూరారం కాలని ఎన్టీఆర్ నగర్ కు చెందిన డి.సునంద లు ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. కాగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపి వివేకానంద్ సదరు కుటుంబాలకు భరోసా నిచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద దరఖాస్తు చేయించి రూ.1.75 లక్షలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సుభాష్నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, వార్డు సభ్యురాలు ఇంద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గ పోరాట దిక్సూచి మంచికంటి

*** సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కార్మిక వర్గ పక్షపాతి మంచికంటి రాంకిషన్ రావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు.స్థానిక మంచికంటి భవన్ లో మంచికంటి ముప్పై ఒకటవ వర్ధంతి కార్యక్రమం జరిగింది.ముందుగా మంచికంటి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబానికి దత్త పుత్రుడుగా వెళ్ళినప్పటికి పేదలు కార్మికుల కోసమే తన జీవితాన్ని అంకితం చేశాడనీ అన్నారు. కామంచికల్ గ్రామంలో తన వాటా కింద వచ్చిన వందల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసి పేదల పట్ల తనకున్న ప్రేమను చాటుకున్నారని కొనియాడారు.ఖమ్మం ఎమ్మెల్యే గా ప్రజలకు ఖమ్మం ప్రజలకు సేవ చేస్తూనే కొత్తగూడెంలో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు అని అన్నారు.ఎమ్మెల్యే గా ఉంటూ అతి సాధారణ జీవితం గడిపాడని నిరంతరం ప్రజల కోసం పరితపించే వ్యక్తి మంచికంటి అన్నారు.ప్రజా ఉద్యమంలో ఎన్నో కేసులు నిర్బంధాలు ఎదురైన తను నమ్మిన ఎర్రజెండాను వీడలేదని అనారోగ్యంతో ఉన్న జైలు అధికారులు కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి హాస్పిటల్ కి తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టిన కమ్యూనిస్టు ఉద్యమాన్ని విడిచిపెట్టలేదని అకుంఠిత దీక్షతో పార్టీ నిర్మాణానికి ప్రజా పోరాటాల నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు ,జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, భూక్య రమేష్ ,యాస నరేష్ నాయకులు డి .వీరన్న, రమేష్ ,వై వెంకటేశ్వరరావు ,అభిమిత్ర, విజయ్ ,సలీం తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు

*** న్యూస్ పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి..**



ప్రజాస్ఫూర్తి నల్లగొండ : పట్టణంలోని యాటకన్నారెడ్డి కాలనీలోని న్యూస్ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటల అనంత రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని మరియు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం వలన అందులోని కష్ట నష్టాలను కూడా తెలుసుకోగలుగుతారన్నారు. విద్యార్థులు వారి వారి పాత్రలకు తగినట్లుగా డ్రెస్ కోడింగ్ చేసుకొని రావడం హర్షనీయమని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉన్నత స్థానానికి ఎదగాలని మరియు దేశంపై ప్రేమాభిమానం పెంచుకోవాలని తెలిపారు. స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు మంత్రులుగా, ఎంపీ , ఎమ్మెల్యే , డీఈవో , ఎంఈఓ , పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ, ప్రిన్సిపల్ అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి, అలుగుబెల్లి స్పందన, పర్వత్ రెడ్డి, ఫాతిమా, జగన్ రెడ్డి, నగేష్, స్వామి, లక్ష్మణ్, సతీష్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల శ్రేయస్సు కోసం తన సహకారం ఎల్లవేళలా అందిస్తా

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఉద్యోగుల శ్రేయస్సు కోసం తన సహకారం ఎల్లవేళలా అందిస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. టీజీఎస్ఆర్టీసీ జీడిమెట్ల బస్ డిపో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ను శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్టేట్ సెక్రటరీ మల్లయ్య, ఎం డి మదర్, చీఫ్ అడ్వైసర్, చెన్నయ్య,రమ్య శ్రీ, ఎం రాజు, డిపో సెక్రటరీ ముద్దం మహేష్ యాదవ్,డిపో ప్రెసిడెంట్ కోలా రాజు గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ ముదిరాజ్ , జాయింట్ సెక్రటరీ ఉమా దేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐతం నరసింహ యాదవ్ జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఐతం నరసింహ యాదవ్ జన్మదినం సందర్భంగా శనివారం తన గురువు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాసరెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కొలను శ్రీనివాస్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు డివిజన్ల నుంచి మిత్రులు , కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,11 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలూరి సత్య (నాని),14 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిళ్ళపల్లి శ్రీనివాస్,మౌళేశ్వరరావు,వర్మ రాజు, ప్రేమ్ కుమార్, కొలన్ లక్ష్మారెడ్డి, శ్రీశైలం యాదవ్,కుమార్ యాదవ్,ఇస్మాయిల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా జనరల్ సెక్రెటరీ ఈశ్వరమ్మ, బి శ్రీనివాస్,కృష్ణ,రమణ బాబు, సురేష్, కుమార్, హరిబాబు, రఘు, నాగరాజు యాదవ్,సుబ్బి రామిరెడ్డి, రమ (మెడిటేషన్ టీచర్), నగీన తదితరులు పాల్గొన్నారు.

# నిన్న వరంగల్ డీటీసీ అరెస్టు.. నేడు డీటీఓపై బదిలీ వేటు

* హైదరాబాద్: వరంగల్ రవాణా శాఖ కార్యాలయ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. నిన్న డీటీసీ శ్రీనివాస్ ఇళ్లల్లో ఏసీబీ దాడులు, అరెస్టు తర్వాత మరో అధికారిపై చర్యలు తీసుకుంది. తాజాగా వరంగల్ డీటీఓ లక్ష్మిపై బదిలీ వేటు వేసింది. హైదరాబాద్లోని కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఎంవీఐ శోభన్ బాబును వరంగల్ ఇంఛార్జ్ డీటీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్ర స్థాయి మాస్టర్ బ్యాట్మెంటన్ పోటీలను ఏ లోటు లేకుండా నిర్వహిస్తున్నాం

* **భద్రాద్రి కొత్తగూడెం బ్యాట్మెంటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సావిత్రి.**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలో 10వ రాష్ట్ర స్థాయి మాస్టర్ బ్యాట్మెంటన్ పోటీలు భద్రాద్రి కొత్తగూడెం బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుధాకర్ రెడ్డి మెమోరియల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 35 ,75 మెన్ అండ్ ఉమెన్ పోర్ట్ ఈ పోటీల్లో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కొత్తగూడెంలోని హనుమాన్ ఇండోర్ స్టేడియం లో రాష్ట్ర స్థాయి పోటీలు ఇదే మొదటిసారి నిర్వహించారు . విజేతలకు విన్నర్స్ రన్నర్స్ కి సర్టిఫికెట్స్ , మెమొంటెస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం బ్యాట్మెంటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సావిత్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాసపల్లి రాజేందర్ ప్రసాద్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనీలు (పిఈటిలు) లావణ్య, రేణుక ,బ్యాడ్మింటన్ సీనియర్ ప్లేయర్స్ అర్జున్ రెడ్డి, సునీల్ కుమార్ ,శివ నాగరాజు, ఫణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్ కాలనీలో ప్యూర్ ఓ నాచురల్ 50వ స్టోర్ ప్రారంభం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి వివేకానంద నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్యూర్ ఓ నాచురల్ 50వ స్టోర్ ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, డిసిపి కే సురేష్ కుమార్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా నాణ్యత ప్రమాణాలతో కస్టమర్ల మన్ననలు పొంది నేడు 50వ స్టోర్ ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కస్టమర్ల మనల్ని పొందుతూ మారేంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్టోర్ నిర్వాహకులు శివరావు, మల్లికార్జున ప్రసాద్ లు మాట్లాడుతూ... 21 సంవత్సరాల నుండి కొనుగోలుదారులకు తాజాగా , నాణ్యత కలిగిన వివిధ రకాల పండ్లు ,కూరగాయలతో పాటు, ఎక్జోటిక్ లోనూ నిత్యవసర సరుకులు పలు రకాలు వినియోగదారులకు అందిస్తున్నామన్నారు.

## భీష్మ ఏకాదశి సందర్భంగా రాజపేటలో నగర సంకీర్తన

* **మర్కూక్ ఆశ్రమం ఆధ్వర్యంలో కార్యక్రమం**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : మర్కూక్ శ్రీ భావానంద స్వామి వారి ఆశీస్సులతో అదరాసుపల్లి శ్రీధర శర్మ పర్యవేక్షణలో రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అర్చక స్వాముల చలివేదంలో వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో రాజపేట శాఖ అధ్యక్షులు నంగునూరు రాజు భక్త బృందం శనివారం వేకువజామున నగర సంకీర్తన నిర్వహించారు. రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుండి శివాలయం, మార్కండేయ స్వామి వారి ఆలయం, సంగమేశ్వర ఆలయము, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం(మఠం), పుట్ట హనుమాన్, హనుమాన్ దేవాలయం, శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయంల దర్శనం చేసుకుంటూ నగర సంకీర్తన "హరే రామ నామ జప యజ్ఞం"తో కొనసాగింది. అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ బావానంద అష్టకం సామూహికంగా పటించారు. ఆలయంలో కొలువైన దేవత మూర్తులకు పూలమాలల అలంకరణ ప్రత్యేక పూజలు జరిగాయి. తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు రాజు, నాల్ల శేఖర్, బిర్రు శ్రీనివాసులు, ఎక్కలదేవి రాజు, ఉప్పల రమేష్ తదితరులున్నారు. మండలంలోని రఘునాథపురం, చల్లూరు, కాల్వపల్లి గ్రామాలలో కూడా నగర సంకీర్తన జరిగింది

# హైదరాబాదులో ఠాగూర్ సినిమాలోని సీన్ రిపీట్







శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ న్యూరో ఆస్పత్రిలో మరోసారి ఠాగూర్ సినిమాలోని సీన్ రిపీట్ అయింది. న్యూరో సమస్యతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన పేషెంట్ చనిపోయి మూడు, నాలుగు రోజుల తర్వాత కూడా ట్రీట్మెంట్ చేసి లక్షల్లో బిల్లు కాజేసి చివరికి శవాన్ని అప్పగించారంటూ బాధితులు మదీనగూడ సిద్దార్థ్ న్యూరో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా నందునూరు గ్రామానికి చెందిన జి. సుహాసిని (26) డిగ్రీ పూర్తిచేసుకుని ఇంటి దగ్గరే ఉండేది. అయితే గత నెల 10వ తేదీన ఆమె కళ్లు తిరిగి పడిపోయింది. వారి బంధువులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ సరైన వైద్యం అందడం లేదని, పరిస్థితి క్రిటికల్ గా ఉందని చెప్పడంతో వారు అక్కడి డాక్టర్ ను సంప్రదించగా చెన్నైకి కానీ లేదా హైదరాబాద్ కు కానీ తరలించాలని సూచించారు. దాంతో మృతురాలిని నగరంలోని మియాపూర్ సిద్దార్థ్ న్యూరో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుండి సిద్దార్థ్ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఇప్పటి వరకు ఆమెకు వైద్యానికి అయిన రూ.13 లక్షలను బాధితులు ఆస్పత్రికి చెల్లించారు. మరో రూ.5 లక్షలు కట్టాల్సి ఉంది. అయితే శుక్రవారం అర్ధరాత్రి ఆస్పత్రి యాజమాన్యం మృతురాలి బంధువులకు కాల్ చేసి యువతి సీరియస్ గా ఉందని డబ్బులు కట్టి వెంటనే ఇక్కడి నుండి తరలించాలని లేదంటే తామే మాస్క్ తీసేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన బాధితులు యువతిని అంబులెన్స్ ద్వారా నిమ్స్ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అంబులెన్స్ లో పేషెంట్ ను తీసుకువెళ్తుండగా అందులో వెళ్తున్న ఆస్పత్రి అటెండర్ మధ్యలోనే వదిలేసి వెళ్లాడని, అక్కడ మరో వ్యక్తి తమతో పాటు నిమ్స్ ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ కు చూపించగా పేషెంట్ చనిపోయిందని అక్కడి డాక్టర్లు తెలిపారు. దీంతో మృతురాలి బంధువులు మృతదేహాన్ని తిరిగి మదీనగూడ సిద్దార్థ్ న్యూరో ఆసుపత్రికి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఇదే విషయం పై సిద్దార్థ్ న్యూరో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ వెంకటేష్ నాయుడును వివరణ కోరగా లీగల్ నోటీసు తీసుకుని వస్తే మాట్లాడుతా లేదంటే మాట్లాడను అంటూ మీడియా మీద చిందులు తొక్కారు. నా ప్రెమిసెస్ లోకి ఎందుకు వచ్చారు. మీకేం పని అంటూ దురుసుగా వ్యవహరించారు. సిద్దార్థ్ న్యూరో ఆస్పత్రి సిబ్బంది సైతం తమ పై భౌతిక దాడికి యత్నించారని మృతురాలి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలంటూ కమ్యూనిస్టు నాయకులు ధర్నా చేపట్టారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శోభన్, అనిల్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## అంతర పంటల సాగు ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రైతులు ఒకే పంట మీదే ఆధారపడకుండా అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ములకలపల్లి మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మట్టితో తయారుచేసిన ఇటుకలు తో నిర్మించే ప్రహరీ గోడ పనులను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానికంగా మట్టితో తయారుచేసిన ఇటుకలను ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాతూరులో ఈదర మురళి అనే రైతు సాగు చేస్తున్నటువంటి ఫామ్ పౌండ్ లో చేపల పెంపకాన్ని పరిశీలించి, ఇంకా ఫామ్ పాండ్ అభివృద్ధి పరచటానికి ఏ రకం చేపల పెంపకం ద్వారా ఎక్కువ ఆదాయం చేకూరుతుందో తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఒక్క పంట పైనే ఆధారపడకుండా అంతర్ పంటగ చేపల పెంపకం, మునగ, నాటు కోళ్లు మరియు తేనెటీగల పెంపకం వంటివి సాగు చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఈ అంతర పంటల సాగుకు ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా మునగ పంట వేసుకున్న వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు సబ్సిడీలు అందుతాయని అదేవిధంగా పంట చేనులో ఫారం పాండ్లు ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా తీయడం జరుగుతుందని ఈ ఫారం పాండ్లలో రైతులు చేపల పెంపకం చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో రేవతి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన ఢిల్లీ ప్రజల తీర్పు

* **బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరు అశోక్ గౌడ్**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : లిక్కర్ మాఫియా డాన్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ పార్టీ కి గాడిద గుడ్డు సీట్లు అందించిన ఢిల్లీ ఓటర్ల తీర్పు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరు అశోక్ గౌడ్ అన్నారు. శనివారం ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి విజయం సాధించిన అనంతరం రాజాపేట మహాత్మా గాంధీ కూడలి వద్ద సంబరాలు జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మేకల రమేష్ ఆధ్వర్యంలో సీట్లు పంచుకొని, బాణాసంచాలు కాల్చి కార్యకర్తలు అందరూ సంబరాలు చేసుకున్నారు , ఈ కార్యక్రమం ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూర్ అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఢిల్లీ శాసనసభ విజయం సాధించిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి మద్యం పాలసీలో నిందితులైన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఉప ముఖ్యమంత్రి మనిషిపొడియా, సత్యంధ్రాజైన్ తదితరులు అందరికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పారని, అదేవిదంగా కాంగ్రెస్ పార్టికి గాడిద గుడ్డు ఇచ్చారని, ప్రజలు అవినీతితో విసిగిపోయి ఆమ్ఆద్మీ పార్టికి తగిన గుణ పాఠం చెప్పారని తెలిపారు, అదేవిదంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఇదే స్ఫూర్తితో అన్ని స్థానాలు భారతీయ జనతా పార్టి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజి అధ్యక్షులు కాయితీ బాలిరెడ్డి, కిసానమోర్చా అధ్యక్షులు, ఎర్ర గోకుల వినోద్, మెందు భగవాన్ రెడ్డి, రాజపేట పట్టణ అధ్యక్షులు సాధనబోయిన శెంకరు,రేణికుంట మాజి ఉపసర్పంచ్ బూర్గు శేఖర్ రెడ్డి,చల్మలపల్లి లక్ష్మణ్, భూక్యా శ్రీను నాయక్, గవ్వల సిద్దేశ్వర్,బెడిద కృష్ణ, ఐరేణి శ్రీధర్, కోయ మధు, కోయ ఉపేందర్, చిగుళ్ళ బీరయ్య, రంగ నరేష్, కాకల నవీన్, సోమసాని చెంద్రమోహన్, గణేష్ నాయక్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా వలవల నాయుడు జన్మదిన వేడుకలు



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్ బీ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ బిజినెస్ సెల్ అధ్యక్షుడు వలవల నాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని వలవల నాయుడిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వారిలో పవన్, కెపిహెచ్బీ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేష్ రాయ్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మదార్





పాలకుర్తి, (ప్రజాస్ఫూర్తి) : పాలకుర్తి నియోజకవర్గంలో మైనార్టీల్లో పట్టున్న నాయకున్ని బిఆర్ ఎస్ కోల్పోయింది. స్థానిక ఎన్నికల నగారా మోగనున్న వేల రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బి.ఆర్.ఎస్ ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ మదార్ బి ఆర్ ఎస్ కు గుడ్ బాయ్ చెప్పి శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆమె పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు. ఈ పరిణామంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కలకలం రేపుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు తన పట్టు కోల్పోతున్నారన్నారు. పార్టీ లోనికి నూతన రక్తం తీసుకురావడంలో విఫలమయ్యారు. నాయకత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే భావనతో పలువురు అసంతృప్త నేతలు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. పలు వర్గాల సమాచారం ప్రకారం, మరికొంత మంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

## ఘనంగా జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025 ముగింపు వేడుకలు





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మూడు రోజుల పాటు జరిగిన జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ 2025 ముగింపు వేడుకలు జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది.జిల్లా పోలీస్ శాఖలోని అన్ని విభాగాలలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ముందుగా ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ 100 మీటర్స్ పరుగు పందెం ఫైనల్ , టగ్ ఆఫ్ వార్ ఫైనల్ మ్యాచ్ లను తిలకించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీలలో పాల్గొని తమ ఆసక్తిని చూపినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఉత్కంఠ భరితంగా సాగిన కొన్ని క్రీడా పోటీలను చూసి సిబ్బంది లోని పోరాట పటిమను గమనించానని తెలిపారు. వయసుతో కూడా సంబంధం లేకుండా కొంతమంది అధికారులు,సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకంగా ఉందని తెలిపారు.ఈ స్పోర్ట్స్ మీట్లో విభాగాల వారీగా జరిగిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేసి వారికి మెడల్స్ ను అందజేశారు.క్రీడలలోనే కాదు జీవితంలో కూడా ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. స్పోర్ట్స్ మీట్ ను అద్భుతంగా ఏర్పాటు చేసిన అధికారులు,సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సబ్ డివిజన్ల వారీగా క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్ ముగింపు పేరెడ్ తో ఎస్పీ గారికి గౌరవ వందనాన్ని సమర్పించారు.భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ విజ్ఞప్తి మేరకు జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ 2025 ను ముగిస్తున్నట్లుగా ప్రకటించారు.అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని పోలీసు అధికారులు,సిబ్బంది తమ అనందత్సవాలను వ్యక్తపరిచారు.



## సాగునీటి కోసం
# రైతులు వీధులు శుభ్రం చేసి నిరసన

రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట గ్రామంలో రైతు జేఏసీ తరపున రోడ్లు ఊడ్చి రైతులందరూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏసీ గౌరవాధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి ,బెడిదే కృష్ణ , చిగుళ్ల బీరయ్య, కుమ్మరి పుల్లయ్య, కుమ్మరి లక్ష్మణ్, చదిపేట పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు బెడిదే వీరేశం, మెండు భగవాన్ రెడ్డి,శేఖర్ రెడ్డి, శంకర్, రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగునీరు కోసం నినాదాలు చేశారు

# దిల్లీ ఎన్నికలు.. మేధావి వర్గం ఓట్లు భాజపాకే: బండి సంజయ్



హైదరాబాద్: దిల్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా దూసుకెళ్తుండటంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. దిల్లీ ప్రజలు చీపురుతో ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారన్నారు. ''ప్రజాస్వామ్య బద్ధమైన పాలనను దిల్లీ ప్రజలు కోరుకున్నారు. అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు వద్దు అనుకున్నారు. దిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందని ముందు నుంచి ఊహించిందే. మేధావి వర్గం అంతా మా పార్టీకే ఓటు వేశారు. తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో భాజపా విజయం సాధిస్తుంది. రాష్ట్రంలోని మేధావి, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆలోచించి ఓటు వేయాలి. శాసనసభలో మీ సమస్యలపై ప్రశ్నించేది భాజపా ఒక్కటే'' అని బండి సంజయ్ అన్నారు.

## షారోన్ చిల్డ్రన్ హోమ్ లో ఘనంగా
# పూర్వా ఐఏఎస్ డాక్టర్ రమణాచారి జన్మదిన వేడుకలు

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : షారోన్ చిల్డ్రన్ హోమ్ లో పూర్వా ఐఏఎస్ డాక్టర్ రమణాచారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని షారోన్ చిల్డ్రన్ హోమ్ నందు పూర్వ ఐఏఎస్ రమణచారి 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సహకారంతో శనివారం చిల్డ్రన్ హోమ్ లో చిన్న పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శివప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి




బత్తూరి మోహన్ రావు లు మాట్లాడుతూ పూర్వ ఐఏఎస్ డాక్టర్ రమణచారి జన్మదిన వేడుకలను ప్రతి సంవత్సరం పిల్లల మధ్య జరుగుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు. రమణాచారి ఎంతోమంది పేదలకు నివేశస్థలాలను మంజూరు చేశారని వారు కొనియాడారు. ఎంతోమందికి ఆయన సహాయ సహకారాలకు అందించారని వారు అన్నారు. చిన్నపిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని మంచి ఉద్యోగాలు చేయాలని వారు కోరారు. అదేవిధంగా మీరు ఉన్నత స్థాయిలో వెళ్ళినప్పుడు అనాధ పిల్లలకు సహాయ సహకారాలు అందించి వారి భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు పిల్లలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గజవల్లి వెంకటకృష్ణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షులు బత్తుల గిరి తదితరులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే క్యాంప్ లో మేఘాంశ్‌కు అల్ ఇండియా 4వ ర్యాంక్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి లోని వీఆర్ఎస్ అండ్ వీజే స్కూల్ విద్యార్థి మేఘాంశ్‌కు రిపబ్లిక్ డే క్యాంప్ లో అల్ ఇండియా 4వ ర్యాంక్ సాధించింది. జనవరి 1 నుంచి 28వ తేది వరకు ఢిల్లిలో జరిగిన రిపబ్లిక్ డే క్యాంపు లో పాల్గొని జూనియర్ డివిజన్ నేవీ విభాగంలో అఖిల భారత 4వ స్థానం సాధించారు. ఈ శిబిరంలో మేఘాంశ్‌కు ప్రధాన మంత్రి నివాస సందర్శన, ప్రధానమంత్రితో ప్రత్యేక సమావేశంలో పాల్గొనే అవకాశం లభించింది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసాన్ని సందర్శించారు. హైదరాబాద్ కి తిరిగి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఫిబ్రవరి 4వ తేదీన మేఘాంశ్‌ను




ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలను సాంస్కృతిక ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించి, మన ప్రాంత సంప్రదాయ వైభవాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించటం జరిగింది.ఈ విశేష విజయాన్ని పురస్కరించుకుని వీఆర్ఎస్ & వీజే స్కూల్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ. రమణశ్రీ మేఘాంశ్‌ను సన్మానించి, ఘనంగా సత్కరించారు. పాఠశాల, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు ,విద్యార్థులు మేఘాంశ్ విజయాన్ని అభినందనలు తెలిపారు. మేఘాంశ్ కోచ్ 2వ ఆఫీసర్ భాను ప్రకాష్ తన శిష్యుడి విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ, అతని కృషిని, నిబద్ధతను ప్రశంసించారు.ఈ గౌరవం పాఠశాలకు, రాష్ట్రానికి ఎంతో గర్వకారణం మేఘాంశ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

# జాదూ జడావు

ఫ్యాషన్ ప్రపంచంలో భారతదేశానికి చెందిన సంప్రదాయ దుస్తులు, నగలు ఎప్పుడూ ప్రత్యేకమే! మగువల మేనిపై మెరిసిపోయే ఆభరణాలకు మనదేశమే పుట్టినిల్లు. సంక్లిష్టమైన కళానైపుణ్యంతో రూపొందిన జడావు ఆభరణాలకు పూర్వం ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. రాచరికపు శోభను ఇనుమడింపజేసేలా రాళ్లను పొదిగే ప్రత్యేక నైపుణ్యాన్ని జడావు కళగా పిలిచేవారు. అలా రూపుదిద్దుకున్న ఆభరణాలు జడావు నగలుగా ప్రసిద్ధి. నేటికీ పెండ్లిళ్లు, పండుగలు లాంటి సంప్రదాయ వేడుకల్లో ఈ భారీ నగలను ధరిస్తున్నారు. పట్టుచీర మీదికైనా, లంగావోణీ, గాగ్రా పైకి కూడా ఇవి అందంగా నప్పతాయి. ఇందులో భారీ కంఠాభరణాలు, చోకర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కెంపులు, వజ్రాలు, పచ్చలు, వైడూర్యాలు ఇలా విలువైన రత్నాలను ఎలాంటి జిగురు లేకుండా నగల ఆకృతుల్లో పొదగడమే కాకుండా, ఎలాంటి ఎనామిల్ ఫినిషింగ్ లేకుండా రూపొందించడమే జడావు నగల ప్రత్యేకత. తరాల కిందటి నగలను ఈ తరం మెచ్చే విధంగా రూపొందిస్తున్నారు డిజైనర్లు. రాళ్ల కాంబినేషన్‌లోనూ వైవిధ్యాన్ని చూపుతూ అతివల మనసు దోచేస్తున్నారు. ఈ తరహా నగలు బంగారంలోనే కాకుండా ఇమిటేషన్ జువెలరీగానూ అందుబాటులోకి వచ్చాయి. వన్‌గ్రామ్ గోల్డ్, ఆక్సిడైజ్డ్ సిల్వర్‌లోనూ ఇవి దొరుకుతున్నాయి. ఎందుకు ఆలస్యం.. మీరూ ఒకసారి ట్రై చేయండి.










# ఎన్ని ప్రయోజనాలో తెలిస్తే ఆశ్చర్యపోతారు..!



మసాలా వంటకాలు అంటే మనకు ఎంతో ఇష్టంగా ఉంటుంది. వెజ్ లేదా నాన్ వెజ్ వంటల్లో అనేక వెరైటీ వంటకాలు మనకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఏ మసాలా వంటకం అయినా సరే కచ్చితంగా పలు దినుసులను వేస్తుంటారు. వాటిల్లో దాల్చిన చెక్క కూడా ఒకటి. దీన్ని వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే దాల్చిన చెక్క ఆయుర్వేద పరంగా ఎన్నో అద్భుతమైన లాభాలను అందిస్తుంది. దీన్ని అనేక ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. దాల్చిన చెక్కను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ముఖ్యంగా దాల్చిన చెక్కను నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగితే ఎన్నో రోగాల నుంచి బయట పడవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దాల్చిన చెక్క నీళ్లను రోజూ తాగితే అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని వారు అంటున్నారు.

**షుగర్, కొలెస్ట్రాల్‌కు చెక్..**

దాల్చిన చెక్క నీళ్లు డయాబెటిస్ ఉన్నవారికి వరం అనే చెప్పవచ్చు. దాల్చిన చెక్కలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీని వల్ల కణాలు సురక్షితంగా ఉంటాయి. అలాగే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. శరీర రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను సంరక్షిస్తాయి. గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూస్తాయి. దాల్చిన చెక్క నీళ్లను తాగడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు.

**రోగ నిరోధక శక్తికి..**

దాల్చిన చెక్క నీళ్లను సేవిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు నయం అవుతాయి. ఈ నీళ్లను తాగడం వల్ల కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం. దీంతో నొప్పులను, వాపులను తగ్గించుకోవచ్చు. దాల్చిన చెక్క నీళ్లను తాగడం వల్ల క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ నీళ్లను సేవిస్తే ఐరన్ సమృద్ధిగా లభించి రక్త కణాలు తయారవుతాయి. దీంతో రక్తహీనత సమస్య తగ్గుతుంది. దాల్చిన చెక్కలో ఉండే మాంగనీస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆస్టియోపోరోసిస్ రాకుండా రక్షిస్తుంది.

**స్త్రీలు, పురుషుల సమస్యలకు..**

స్త్రీలు నెలసరిస మయంలో ఈ నీళ్లను సేవిస్తుంటే నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. అధిక రక్తస్రావం తగ్గుతుంది. దాల్చిన చెక్క నీళ్లు పురుషులకు కూడా ఎంతగానో మేలు చేస్తాయి. ఈ నీళ్లలో కాస్త తేనె కలిపి తాగుతుంటే పురుషుల్లో నపుంసకత్వ సమస్య తగ్గుతుంది. శృంగార సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్ల సమస్యలు పోతాయి. దీంతో సంతానం కలిగే అవకాశాలు పెరుగుతాయి. ఇలా దాల్చిన చెక్కతో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. అయితే కొందరికి ఈ నీళ్లను సేవిస్తే జీర్ణాశయంలో అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఈ నీళ్లను తాగకపోవడమే మంచిది.

# జాదూ జడావు

ఫ్యాషన్ ప్రపంచంలో భారతదేశానికి చెందిన సంప్రదాయ దుస్తులు, నగలు ఎప్పుడూ ప్రత్యేకమే! మగువల మేనిపై మెరిసిపోయే ఆభరణాలకు మనదేశమే పుట్టినిల్లు. సంక్లిష్టమైన కళానైపుణ్యంతో రూపొందిన జడావు ఆభరణాలకు పూర్వం ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. రాచరికపు శోభను ఇనుమడింపజేసేలా రాళ్లను పొదిగే ప్రత్యేక నైపుణ్యాన్ని జడావు కళగా పిలిచేవారు. అలా రూపుదిద్దుకున్న ఆభరణాలు జడావు నగలుగా ప్రసిద్ధి. నేటికీ పెండ్లిళ్లు, పండుగలు లాంటి సంప్రదాయ వేడుకల్లో ఈ భారీ నగలను ధరిస్తున్నారు. పట్టుచీర మీదికైనా, లంగావోణీ, గాగ్రా పైకి కూడా ఇవి అందంగా నప్పతాయి. ఇందులో భారీ కంఠాభరణాలు, చోకర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కెంపులు, వజ్రాలు, పచ్చలు, వైడూర్యాలు ఇలా విలువైన రత్నాలను ఎలాంటి జిగురు లేకుండా నగల ఆకృతుల్లో పొదగడమే కాకుండా, ఎలాంటి ఎనామిల్ ఫినిషింగ్ లేకుండా రూపొందించడమే జడావు నగల ప్రత్యేకత. తరాల కిందటి నగలను ఈ తరం మెచ్చే విధంగా రూపొందిస్తున్నారు డిజైనర్లు. రాళ్ల కాంబినేషన్‌లోనూ వైవిధ్యాన్ని చూపుతూ అతివల మనసు దోచేస్తున్నారు. ఈ తరహా నగలు బంగారంలోనే కాకుండా ఇమిటేషన్ జువెలరీగానూ అందుబాటులోకి వచ్చాయి. వన్‌గ్రామ్ గోల్డ్, ఆక్సిడైజ్డ్ సిల్వర్‌లోనూ ఇవి దొరుకుతున్నాయి. ఎందుకు ఆలస్యం.. మీరూ ఒకసారి ట్రై చేయండి.










# హోండాతో చర్చలు విఫలం

## కొత్త ఆటోమేకర్ పార్ట్‌నర్స్ కోసం అన్వేషణ

## జాబితాలో ఫాక్స్‌కాన్ పేరు




**న్యూఢిల్లీ:** జపాన్‌కు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థలు హోండా మోటార్, నిస్సాన్ మోటార్ మధ్య విలీనంకు సంబంధించి గత కొంతకాలంగా పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కంపెనీల మధ్య చర్చలు విఫలం కావడంతో ఇప్పుడు నిస్సాన్ కొత్త పార్ట్‌నర్స్ కోసం వెతుకుతోందనే ప్రచారం నడుస్తోంది. ఈ జపాన్ ఆటోమేకర్ విలీనం కోసం కొన్ని పేర్లను పరిశీలిస్తోందని, అందులో తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ కూడా ఉందని రాయిటర్స్ తెలిపింది.

### రెండు సంస్థల మధ్య చర్చలు విఫలం

ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆటోమేకర్‌ను సృష్టించే ఒప్పందంలో ఈ వారం ప్రారంభంలో హోండాతో చర్చల నుండి నిస్సాన్ వెనక్కి తగ్గింది. అంతకుముందు విలీనం నిమిత్తం నిస్సాన్ సీఈఓ మకోటో ఉచిడా, హోండా టాప్ ఎగ్జిక్యూటివ్ తోషిహిరో మిబేతో సమావేశమయ్యారు. ఈ భేటీలోనే హోండాతో అనుబంధ సంస్థగా పనిచేసేందుకు నిస్సాన్ నిరాకరించింది. చర్చలను ముగించాలని కోరుకుందని పలు నివేదికలు తెలిపాయి. ఈ విషయంపై హోండా గానీ, నిస్సాన్ ప్రతినిధులు గానీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ డిసెంబర్‌లో, ఈ రెండు కంపెనీలు హోల్డింగ్ కంపెనీ కింద ఏకీకరణ గురించి చర్చించడానికి ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఆ తర్వాత ఒప్పందంలో తలెత్తిన కొన్ని తేడాల వల్ల చర్చలు క్లిష్టతరమయ్యాయి. అవే చివరకు చర్చల విఫలమయ్యేందుకు కారణమైనట్టు తెలుస్తోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా వాహన పరిశ్రమలో పెరుగుతున్న పోటీని ఎదుర్కొనడానికి జపాన్‌లో రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ అయిన హోండా మూడో అతిపెద్ద సంస్థ అయిన నిస్సాన్ విలీనం కోసం చర్చలు మొదలుపెట్టినట్లు గతేడాది ప్రకటించాయి. కానీ రెండు కంపెనీల మధ్య పెరుగుతోన్న విభేదాల వల్ల చర్చలు కష్టంగా మారాయని కొన్ని రోజుల క్రితం నుంచే వార్తలు వస్తున్నాయి. నిస్సాన్ కంటే దాదాపు 3 రెట్లు ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన హోండా.. దాని పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా నిస్సాన్ ఆందోళన చెందుతోంది, ఈ విలీనం రద్దయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయని కూడా కొన్ని వార్తా కథనాలు పేర్కొన్నాయి. అనుకున్నట్టుగానే ఇరు సంస్థల మధ్య చర్చలు విఫలమై విలీనానికి అడ్డుకట్ట పడింది.

# గోల్డ్ లోన్ వ్యాపారంలోకి మరో ఎన్‌బీఎఫ్‌సీ..

## గ్రామీణ ప్రాంతల్లో వ్యాపార విస్తరణే ముఖ్యం



**న్యూఢిల్లీ:** ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ కంపెనీ పాల్ మర్చంట్స్ ఫైనాన్స్ జతకట్టడం వల్ల ఈ ఫ్రాంచైజ్ కంపెనీ సెక్యూర్డ్ లోన్ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోకు అదనంగా ఉంటుంది.ఇది మొత్తం క్యాష్ డీల్ అని స్లంప్ సేల్ ప్రాతిపదికన ముగింపు వరకు కొన్ని సర్దుబాట్లతో పాటు రూ. 537 కోట్ల మొత్తాన్ని చెల్లిస్తామని ఎల్ అండ్ టి ఫైనాన్స్ తెలిపింది. అయితే ఈ వ్యాపార బదిలీ 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి ముగిసే అవకాశం ఉంది. చండీగఢ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లోని మార్కెట్‌లే టార్గెట్‌గా ఎల్ అండ్ టీ గోల్డ్ లోన్ వ్యాపారం చేయనుందని నిపుణులు చెబుతున్నారు.

ముఖ్యంగా ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వద్ద తన శాఖల 24/7 రిమోట్ పర్యవేక్షణ కోసం పూర్తిగా పనిచేసే నెట్‌వర్క్, భద్రతా కేంద్రం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే దాదాపు 700 మంది ఉద్యోగులతో ఎల్‌అండ్ టీ ఫైనాన్స్ 130 శాఖలను లాంచ్ చేస్తున్నట్లు కంపెనీ ఫిబ్రవరి 7న రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ సందర్భంగా ఎల్‌టీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ సుదీప్త రాయ్ మాట్లాడుతూ స్థిరమైన వృద్ధిని, ఆకర్షణీయమైన రాబడిని అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బంగారు రుణాలను ప్రజలకు విరివిగా అందించడమే తమ లక్ష్మని తెలిపారు.

# పీఎఫ్ ఖాతా ఉన్నవారికి అలెర్ట్.. మరో వారం రోజులే ఆ గడువు




**న్యూఢిల్లీ:** భారతదేశంలోని ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్రం ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంది. పీఎఫ్ ద్వారా ఉద్యోగి ప్రాథమిక జీతంలో 12 శాతం, అలాగే యజమాని కూడా అంతేమొత్తంలో ఇచ్చే వాటాతో కలిపి పీఎఫ్ ఖాతాలో పొదుపు చేస్తూ ఉంటారు. అయితే మారుతున్న టెక్నాలజీ ప్రకారం ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంది. దీనికి అనుగుణంగా యూనివర్శల్ అకౌంట్ నంబర్(యూఏఎన్) ద్వారా ఒక వ్యక్తి ఒకే పీఎఫ్ అకౌంట్ ఉండేలా చర్యలు తీసుకుంది. అలాగే యూఏఎన్ ద్వారా నగదు విత్ డ్రా సేలను కూడా సులభతరం చేసింది. ఈ నేపథ్యంలో కొంత మంది ఖాతాదారులు యూఏఎన్ నంబర్ యాక్టివేషన్‌లో అలసత్వం చూపుతున్నారు. ఇలాంటి వారికి ఈపీఎఫ్ఓ షాక్ ఇచ్చింది. ఫిబ్రవరి 15లోపు యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోకపోతే ఈపీఎఫ్‌లో కొన్ని సేవలు వారికి వర్తించవని పేర్కొంది.

యూనివర్సల్ అకౌంట్ నంబర్ యాక్టివేట్ చేసుకోవడానికి గడువును ఫిబ్రవరి 15 వరకు మాత్రమే ఈపీఎఫ్ఓ ప్రతినిధులు చెబుతున్నారు. ఈపీఎఫ్ఓ ఫిబ్రవరి 2, 2025 నాటి తన సర్క్యులర్లో యూఏఎన్ యాక్టివేషన్‌తో పాటు ఆధార్ సీడింగ్ కోసం ఫిబ్రవరి 15 తర్వాత ఎలాంటి పొడగింపులు ఉండవని ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొంది.

# ముంబై ఓపెన్ సెమీస్ చేరిన మాయ

## క్వార్టర్ ఫైనల్లో మీ యమగూచిపై విజయం



**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ లో 15 ఏళ్ల టీనేజర్ మాయ రాజేశ్వరన్ ప్రకంపనలు సృష్టిస్తోంది. 15 ఏళ్ల వయసులో తొలి డబ్ల్యూటీఏ పాయింట్ సాధించిన్న పిన్న వయస్కురాలిగా నిలిచింది. ముంబై ఓపెన్ సెమీస్ కు చేరుకోవడం ద్వారా తను ఈ ఘనత సాధించింది. గతంలో హైదరాబాదీ సానియా మీర్జా టెన్నిస్ లో భారత్ తరపున ఎన్ని ప్రకంపనను రేపిందో తెలిసిన సంగతే. తాజాగా మాయలో అలాంటి పొటెన్షియల్ ఉందని నిపుణుల వాదాన తాజగా జరిగి ముంబై ఓపెన్ లో సెమీస్ చేరి సత్తా చాటింది. క్వార్టర్ ఫైనల్లో మయా 6-3, 3-6, 6-0తో ప్రపంచ నె. 285, జపాన్ కు చెందిన మీ యమగూచిని ఓడించింది. మూడు సెట్ల పాటు జరిగిన ఈ మ్యాచ్ లో మయా కీలకదశలో సత్తా చాటింది. తొలి సెట్ లో సర్వీస్ బ్రేక్ చేసి సునాయాసంగా గెలుచుకున్న మాయ, రెండో సెట్లో మాత్రం తడబడి ప్రత్యర్థికి సెట్ సమర్పించుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రెండు బ్రేక్ పాయింట్లు సాధఇంచి సత్తా చాటింది. పదునైన షాట్లు, నెట్ దగ్గరికి వచ్చి పాయింట్లు సాధించి తను విజయం సాధించింది. ఈ టోర్నీలో వైల్డ్ కార్డు ఎంట్రీగా బరిలోకి దిగిన మయా.. పలు సంచనల ప్రదర్శనలు నమోదు చేసింది. తొలి రౌండ్ లోనే ప్రపంచ 225, బెలారస్ కు చెందిన ఇరీనా షిమనోవిచ్ ను 6-4, 6-1తో వరుస సెట్లలో సునాయసంగా ఓడించి సంచలనం రేకెత్తించింది. ప్రి క్వార్టర్స్ లో ఎంతో మెరుగైన ప్రపంచ నెంబర్ 264, ఇటలీకి చెందిని నికోల్ ఫొస్సాను కంగుతినిపించింది. ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన ఈ మ్యాచ్ లో తొలి సెట్ ను గెలుచుకుని సత్తా చాటిన మాయ, అనుభవ రాహిత్యంతో రెండో సెట్ లను ప్రత్యర్థికి అప్పగించింది. ఇక కీలకమైన మూడో సెట్ లో ప్రత్యర్థి సర్వీస్ ను మూడుసార్లు బ్రేక్ చేసి, ఒక్క పాయింట్ ఇవ్వకుండానే మూడో సెట్ తో పాటు మ్యాచ్ ను తన సొంతం చేసుకుంది. దీంతో పిన్న వయస్సులోనే ఈ టోర్నీ సెమీస్ కు చేరుకుంది. ఇక అంతకుముందు జరిగిన మ్యాచ్ లో మయా 7-6, 1-6, 6-4తో అమెరికాకు చెందిన జెస్సిక ఫైల్లా ను ఓడించింది. తను గెలిచిన గత మూడు మ్యాచ్ ల్లోనూ మూడు సెట్లపాటు పోరాడి ప్రత్యర్థులను ఓడించడం విశేషం. తమిళనాడులోని కొయంబత్తూర్ లో 2009, జూన్ 12న జన్మించిన మాయ.. ఎనిమిదేళ్ల వయసులోనే రాకెట్ చేతబట్టి ప్రాక్టీస్ ప్రారంభించింది. మాజీ ఇండియా నెం.1 కేజీ రమేశ్ మార్గదర్శకత్వంలో తొలి అడుగులు వేసిన మాయ.. ఆ తర్వాత ప్రొ సర్వ టెన్నిస్ అకాడమీలో తన ఆటకు మెరుగులు దిద్దుకుంది. కోచ్ మనోజ్ కుమార్ శిక్షణలో చాలా రాటుదేలింది. గత ఐదేళ్లుగా దినదనాభివృద్ధి చెందుతూ వస్తోంది. అమెరికన్ గ్రేట్ సెరెనా విలియమ్స్, రష్యన్ ప్లేయర్ సబలెంకా ఆటను ఇష్టపడే మయా.. వారి తరహాలోనూ దుకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులకు ముచ్చెటమలు పోయిస్తోంది. తన కెరీర్లో కేవలం ఐదో మేజర్ టోర్నీలో ఆడుతున్న మాయ.. ఏకంగా సెమీస్ కు చేరి అందరి చేత వారెవ్వా అనిపించింది. అంతకుముందే ఆమె ప్రతిభను గుర్తింపు లభించింది. ప్రముఖ రఫా నాదల్ అకాడమీలో ట్రైనింగ్ కు కూడా పిలుపొచ్చింది. స్పెయిన్ లో ఏడాది పాటు జరిగే శిక్షణలో తన ఆటతీరును మరింతగా రాటు దేల్చుకోవాలని మాయా భావిస్తోంది. వచ్చేనెలలో అకాడమీలో జాయిన్ కావడం కోసం స్పెయిన్ బయలు దేరుతోంది. దీంతో వచ్చే కొన్ని సంవత్సరాల్లో భారత చిచ్చిర పిడుగు మాయా పేరు వినిపించడం ఖాయం అని తెలుస్తోంది. ప్రస్తుతానికి కైతే ముంబై ఓపెన్ ను దక్కించుకోవాలని ఆరాట పడుతోంది. శనివారం జరిగే సెమీస్ లో ప్రపంచ నెం 117 స్విట్జర్లాండ్ కు చెందిన జిల్ టెయిక్ మన్ తో మయా తలపడనుంది.

# గిల్‌క్రిస్ట్ రికార్డును అధిగమించిన అలెక్స్ క్యారీ

## ఆసియా గడ్డపై అత్యధిక పరుగులు చేసిన ఆసీస్ కీపర్‌గా రికార్డు




**సిడ్నీ:** ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు నెలకొల్పాడు. ఆసియా గడ్డపై టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి ఆసీస్ వికెట్ కీపర్గా నిలిచాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులు చేసి, ఆడమ్ గిల్‌క్రిస్ట్ 2004లో శ్రీలంకపై చేసిన 144 పరుగుల రికార్డును అధిగమించాడు. అలెక్స్ క్యారీ 156 పరుగులతో ఆసియా గడ్డపై 150ం పరుగులు చేసిన నాన్-ఆసియా బ్యాటర్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఈ జాబితాలో ఆండీ ఫ్లవర్ (232, 183), ఏబీ డివిలియర్స్ (164), టాటెండా టైబు (153), క్లైడ్ వాల్‌కట్ (152), వారెన్ లీస్ (152)లిలి లాంటి దిగ్గజాలు ఉన్నారు. ఈ ఇన్నింగ్స్‌లో క్యారీతో పాటు కెప్టెన్ స్టీవ్ స్మిత్ (131) కూడా సెంచరీ సాధించడంతో, ఆస్ట్రేలియా 414 పరుగుల భారీ స్కోర్ చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకు ఆలౌట్ అయిన శ్రీలంకపై ఆసీస్ 157 పరుగుల ఆధిక్యం సాధించింది. ప్రభాత్ జయసూరియా ఐదు వికెట్లు (5/151) తీయగా, నిషన్ పీరిస్ మూడు, రమేశ్ మెండీస్ రెండు వికెట్లు తీశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 128 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. మాథ్యూ కుహ్నేమన్ మూడు, నాథన్ లయన్ రెండు వికెట్లు తీసి శ్రీలంకను కష్టాల్లో నెట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో కుశాల్ మెండిస్ (85) తప్ప అందరూ విఫలమయ్యారులి. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, కుహ్నేమన్, లయన్ మూడేసి వికెట్లు తీయగా, ట్రావిస్ హెడ్ ఒక వికెట్ తీశాడు. అలెక్స్ క్యారీ ఆసియా గడ్డపై టెస్ట్ సెంచరీ చేసిన రెండో ఆస్ట్రేలియా కీపర్-బ్యాటర్. ఇంతకుముందు ఆడమ్ గిల్‌క్రిస్ట్ నాలుగు సెంచరీలు సాధించాడు. 33 ఏళ్ల క్యారీ తన గత టెస్ట్ మ్యాచ్‌లలో స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడ్డాడు, కానీ ఈసారి తన తొలి టెస్ట్ సెంచరీని ఆసియా గడ్డపై సాధించాడు.

91/3 ఉన్నప్పుడు, స్టీవ్ స్మిత్‌తో కలిసి క్యారీ 259 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ ద్వయం నిలబడి ఆస్ట్రేలియాకు తిరిగి గెలుపు అవకాశాలు తీసుకొచ్చింది. శ్రీలంక స్పిన్నర్లు విఫలమవ్వడంతో, ఆసీస్ భారీ ఆధిక్యం సాధించింది. శ్రీలంకకు ఈ మ్యాచ్‌లో తిరిగి విజయ అవకాశాలు తక్కువ. బ్యాట్స్‌మెన్ మెరుగైన ప్రదర్శన చేయకపోతే, ఆస్ట్రేలియా ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే అవకాశం ఉంది.

# రెండో వన్డేలో అయ్యర్‌ను తప్పించ వద్దు

## తొలి వన్డేలో కీలక పాత్ర పోషించాడు

## భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్




**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా బ్యాటర్ విరాట్ కోహ్లీ గైర్హాజరీ వల్ల ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. విరాట్ స్థానంలో చోటు దక్కించుకున్న అయ్యర్ అర్ధశతకంతో అదరగొట్టాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు రాణించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే రెండో వన్డేలో విరాట్ తిరిగి వస్తే అయ్యర్‌కు జట్టులో చోటు ఉండదని వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ స్పందించాడు. రెండో వన్డేలో అయ్యర్‌ను జట్టులోంచి తప్పించాలని ఆలోచించడం సరైంది కాదని అన్నాడు. ఎవరూ ఊహించనిది అతడు సాధించాడని అన్నాడు. తొలి వన్డేలో రాణించి, సిరీస్‌లో భారత్‌ను ఆధిక్యంలో నిలపడంలో కీలక పాత్ర పోషించాడని అన్నాడు. ఈ మేరకు జట్టు మేనేజ్‌మెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ తానేంటో నిరూపించుకున్న ఆటగాడు. అతడిని జట్టులో నుంచి పక్కన పెట్టాలని ఆలోచిస్తున్నారన్న విషయం నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతేడాది జరిగిన వరల్డ్ కప్‌లో చాలా పరుగులు చేశాడు. ఓ ఆటగాడు భారీగా పరుగులు చేస్తే అవకాశాలు వస్తాయని అనుకుంటాం. అతడు తన నుంచి బెస్ట్ ఇచ్చాడు. అందుకే దేవుడు మళ్లీ శ్రేయస్?కు అవకాశం ఇచ్చాడు. మేనేజ్ మెంట్ జట్టులో చోటివ్వకపోయినా అతడికి ఆడే అవకాశాన్ని దేవుడు ఇచ్చాడు. అందుకే 50 పరుగులకు పైగా చేసి మ్యాచ్ స్వరూపానే మార్చేశాడు. అలా ఎవరూ ఊహించనిది అతడు చేశాడు' అని భజ్జీ వ్యాఖ్యానించాడు. రిషబ్ పంత్ చాలా మంచి ఆటగాడని కొనియాడాడు హర్భజన్ సింగ్. అయితే అవకాశాల కోసం పంత్ కొన్నాళ్లు వేచి ఉండాల్సిందేనని అన్నాడు. 'ప్రస్తుతం టీమ్‌ఇండియా మేనేజ్?మెంట్ ఆలోచిస్తున్న విధానం ప్రకారం వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కోటాలో కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేసేందుకు ఇష్టపడుతున్నట్లు కనిపిస్తోంది. కాబట్టి రిషబ్ పంత్ అవకాశం కోసం వేచి ఉండాలి. కేఎల్ రాహుల్ బాగా రాణిస్తాడని ఆశిస్తున్నాను. పంత్‌కు కూడా త్వరలో అవకాశాలు వస్తాయి. అప్పటివరకు వేచి ఉండాలి. ధ్రువ్ జురెల్, సంజూ శాంసన్ కూడా లైన్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఎంపికైన జట్టు బాగా రాణిస్తుందని అనుకుంటున్నాను' అని భజ్జీ తెలిపాడు.

# కోహ్లీ ఛాంపియన్స్ ట్రోఫీలో మూడు శతకాలు సాధిస్తాడు

## మాజీ క్రికెటర్ సురేశ్ రైనా జోస్యం






**న్యూఢిల్లీ:** పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో మూడు శతకాలు సాధిస్తాడని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా జోస్యం చెప్పాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా.. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడుతోంది. నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి వన్డేలో విజయం సాధించి ఈ సిరీస్‌లో శుభారంభం చేసింది. అయితే ఈ మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ దూరమైన విషయం తెలిసిందే. మోకాలి గాయంతో అతను ఈ మ్యాచ్ ఆడలేదు. అతని స్థానంలో బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్ హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆదివారం జరిగే రెండో వన్డేలో కోహ్లీ బరిలోకి దిగే అవకాశం ఉంది. కోహ్లీ రాకతో జైస్వాల్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఇక కోహ్లీ గత కొద్ది రోజులుగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. అతనితో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా పరుగులు చేయలేకపోతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ముందు ఈ ఇద్దరి వైఫల్యం ఆందోళనకు గురి చేస్తోంది. సురేశ్ రైనా మాత్రం కోహ్లీ మూడు శతకాలతో చెలరేగుతాడని ధీమా వ్యక్తం చేశాడు. మరో నాలుగేళ్ల పాటు అతను అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతాడని చెప్పాడు. 'ఆటగాడిగా విరాట్ కోహ్లీ సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. అతను మరో నాలుగేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ ఆడగలడు. వన్డే క్రికెట్‌లో అతను నిలకడగా ఆడుతాడు. అతని ఈ ఫార్మాట్ ఆడటం చాలా ఇష్టం. ఐసీసీ టోర్నీల్లోని నాకౌట్ మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీకి మెరుగైన రికార్డ్ ఉంది. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లోనూ అతను ఆడిన ఇన్నింగ్స్‌ను ఎవరూ మర్చిపోలేరు. ఛాంపియన్స్ ట్రోఫీలో విరాట్ కోహ్లీ మూడు శతకాలు సాధిస్తాడని నేను భావిస్తున్నా.'అని సురేశ్ రైనా చెప్పుకొచ్చాడు. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది. 23న పాకిస్థాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. భారత్ మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. సెమీస్, ఫైనల్ చేరితే ఆ మ్యాచ్‌లు కూడా దుబాయ్‌లోనే నిర్వహించనున్నారు.

# స్టన్నింగ్ లుక్‌లో ప్రణీత.. ఫ్యాషన్ వీక్‌లో అసలైన గ్లామర్ ట్రీట్

టాకీస్: తెలుగు ప్రేక్షకులకు ప్రణీత సుభాష గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. 'బావ' సినిమా ద్వారా టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ సుందరి, తన అందంతోనే కాదు, అద్భుతమైన నటనతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'అత్తారింటికి దారేది' చిత్రంలో సమంత తర్వాత స్పెషల్ పాత్ర పోషించిన ప్రణీత, తన క్యూట్ లుక్స్, ఎక్స్‌ప్రెషన్‌తో ఎంతగానో మెప్పించింది. ఆమె కెరీర్ ప్రారంభంలోనే వరుస అవకాశాలతో దూసుకెళ్లింది. ప్రణీత కెరీర్‌లో 'అత్తారింటికి దారేది', 'బ్రహ్మోత్సవం', 'సోగ్గాడే చిన్నినాయన', 'హలో గురు ప్రేమ కోసమే' వంటి చిత్రాలు తెలుగులో ఓ మంచి క్రేజ్ తెచ్చిపెట్టాయి. కాకపోతే, ఈ మధ్య కాలంలో ఆమె ఎక్కువగా తమిళ సినిమాల్లో కనిపించింది. కన్నడ చిత్రాలతో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలను అందిపుచ్చుకుంది. ఇటీవల ప్రణీత తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన తాజా ఫోటోషూట్, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆమె దుబాయ్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని మెరిసిపోతున్న ఫోటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గ్లామరస్ గౌన్‌లో, మెరిసే డ్రెస్‌లో ఆమె లుక్ యాప్ట్‌గా అనిపిస్తోంది. సొగసైన మేకప్, స్టైలిష్ హేర్‌స్టైల్‌తో ప్రణీత ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచింది. ఆమె వేసుకున్న డ్రస్ లుక్, డిజైనింగ్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెళ్లి తర్వాత ఆమె కెరీర్‌కు గ్యాప్ ఇచ్చినా, మళ్లీ రీ-ఎంట్రీ ఇస్తుందా? అన్న ప్రశ్న అభిమానుల్లో ఉంది. ప్రస్తుతం ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నాడు. అయినప్పటికీ ప్రణీత తన గ్లామర్‌తో, స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆమె ఫ్యామిలీ లైఫ్‌ను ఆస్వాదిస్తూ, మరోవైపు ఫ్యాషన్ రంగంలోనూ తనదైన స్టైల్‌ను చూపిస్తోంది. టాలీవుడ్ లో ఆమె మళ్లీ రీఎంట్రీ ఇస్తుందా? లేదా మోడలింగ్, ఫ్యాషన్ ఫీల్డ్‌కి పరిమితం అవుతుందా..? అన్నది చూడాలి.




# విజయ్‌దేవరకొండ, రష్మిక బ్రేకప్

టాకీస్: గత కొన్నేళ్లుగా హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికల మధ్య ఎఫైర్ నడుస్తుందనే రూమార్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు తమ మధ్య ఎలాంటి బంధం లేదని విజయ్ దేవరకొండ , రష్మిక క్లారిటీ ఇస్తునే ఉన్నారు. అయినప్పటికీ వీరిపై ఇలాంటి వార్తలు వస్తునే ఉన్నాయి. ఆ మధ్య విజయ్ దేవరకొండ , రష్మిక ఇద్దరూ వేర్వేరుగా ఒకే ఇంట్లో ఉంటున్న ఫొటోలను తమ సోషల్ మీడియాల్లో పోస్టు చేశారు. విజయ్ దేవరకొండ ఒక ఫోటో దిగిన బ్యాక్‌గ్రౌండ్‌లోనే .. రష్మిక కూడా ఫొటో దిగింది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న పిట్టగోడ రెండూ సేమ్ టు సేమ్. దీంతో వీరిద్దరు ఒకే ఇంట్లో ఉంటున్నట్టు నిర్ధారించుకున్నారు. రష్మిక తన అసిస్టెంట్ వివాహం కోసం హైదరాబాద్‌కు రావడం జరిగింది. అసిస్టెంట్ పెళ్లికి హాజరైన తర రష్మిక,విజయ్ దేవరకొండ ఇంటికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో రష్మిక తీసుకున్న ఫొటో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో అందరు ఒక్కసారి షాక్‌కు గురైయ్యారు.విజయ్



ఇంట్లోనే రష్మిక ఉందని నెటిజన్లు కన్ఫర్మ్ చేసేశారు. రష్మిక, విజయ్ ఓ రెస్టారెంట్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ కనిపించారు. దీంతో మరోసారి వీరిద్దరి రిలేషన్‌షిప్ గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే రష్మిక, విజయ్ దేవరకొండల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయనే చర్చ ఇండస్ట్రీలో సాగుతోంది. దీనికి కారణం కూడా లేకపోలేదు. రష్మిక ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేసింది.

# టైటిల్ కోసం రాజమౌళి కసరత్తు

టాకీస్: మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రం షూటింగ్ సైలెంట్‌గా మొదలైంది. ఇప్పటికే మహేష్ బాబు, ప్రియాంకా చోప్రాలపై ఓ కీలకమైన సన్నివేశాన్ని 5 రోజులపాటు అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్ లో తీర్చిదిద్దారు. తదుపరి షెడ్యూల్ కూడా త్వరలోనే మొదలు కానుంది. ఈ సినిమాలోని ఓ కీలకమైన పాత్రలో నానా పటేకర్ కనిపించబోతున్నారని టాక్. ఆయనపై కూడా లుక్ టెస్ట్ నిర్వహించారని ఇన్ సైడ్



వర్గాలు చెబుతున్నాయి. ఇందులో మహేష్ తండ్రి పా చాలా ప్రాధాన్యం ఉందట. ఆ పాత్ర కోసం ఎవరి ఎంచుకొంటారా? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. నానా పటేకర్‌ని తీసుకొంది మహేష్ తండ్రి పాత్ర కోసమా? కాదా? అనేది తెలియాల్సి ఉంది. మరో పక్క ఈ సినిమా టైటిల్ కోసం రాజమౌళి అన్వేషణ మొదలైంది. 'మహారాజ్' , 'గరుడ' అనే టైటిల్స్ ఈ సినిమా కోసం పరిశీలించారని టాక్ నడిచింది. ఇవి రెండూ ఇప్పుడు ఓల్డ్ టైటిళ్లు అయిపోయాయి. కాబట్టి వాటి జోలికి వెళ్లకుండా 'జనరేషన్' అనే అర్థం వచ్చేలా ఓ పాన్ వరల్డ్ టైటిల్ కోసం అన్వేషిస్తున్నారని తెలుస్తోంది. ఈ కథకు తరతరాల లింక్ ఉంది. అందుకే అలాంటి టైటిల్ యాప్ట్ అని భావిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఏ విషయాన్నీ రాజమౌళి బయటకు రానివ్వడం లేదు. ప్రియాంక చోప్రాని ఎంచుకున్న సంగతి కూడా అధికారికంగా ప్రకటించలేదు.

# కవర్ పేజీపై మీనాక్షి మెరుపులే మెరుపులు

టాకీస్: వరుసగా బ్లాక్ బస్టర్లు కొడుతోంది మీనాక్షి చౌదరి. తెలుగులో లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం ఈ భామకు నటిగా మంచి పేరు తెచ్చి పెట్టగా, గోట్ చిత్రం తమిళంలో తనకు కమర్షియల్ విజయాన్ని కట్టబెట్టింది. ఆరంభం కొన్ని ఫ్లాపులు చికాకు పెట్టినా, ఇప్పటికి టైమ్ వచ్చింది. తనకు కొన్ని హిట్లు అందాయి. ఇది చాలు.. తాను ఏలడానికి అనే నమ్మకంతో మీనాక్షి ఇకపైనా దూసుకెళుతుంది. ఇప్పటికే టాలీవుడ్ కోలీవుడ్ లో వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. మీనాక్షి చౌదరి తాజాగా జే.ఎఫ్.డబ్ల్యూ కవర్ పేజీపై దర్శనమిచ్చింది. ఈ ఫోటోషూట్ పూర్తిగా ప్రయోగాత్మకంగా కనిపిస్తోంది. కాగితంతో తయారు చేసిన డిజైనర్ ఆకులు, పూలు.. వాటితోనే అందమైన డిజైనర్ డ్రెస్. దానికి కాంబినేషన్ హీల్స్, తలలో ఇమిడిన అందమైన క్రౌన్ అలంకరణ..ప్రతిదీ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎలిజబెత్ మాదిరి మీనాక్షి ఇచ్చిన ఫోజు కుర్రకారును కిల్ చేస్తోంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. మీనాక్షి ని చూడగానే డిజైనర్ రాకుమారిని తలపిస్తోందని అభిమానులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. తన అందం, సొగసుకు తగ్గట్టుగానే.. అందాల మీనాక్షి మతులు చెడగొడుతోందని కుర్రకారు ప్రచారం చేస్తున్నారు. మీనాక్షి అసలు నటి కావడమే మిరాకిల్ అని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ముంబైలో జరిగిన ఒక నటనా వర్క్‌షాప్‌లో... తెలుగు నటుడిని కలిశాక..అతడు వేరే భాషలో అయినా నటనను కొనసాగించమని నన్ను ప్రోత్సహించాడని తెలిపింది. కొన్ని నెలల తర్వాత ఊహించని కాల్. నా వీడియోలు చూసిన ఓ దర్శకుడు కాల్ చేసారు. ఊహించని అవకాశం నాకు సరైన సమయంలో వచ్చింది అని మీనాక్షి చౌదరి తెలిపింది. తన కుటుంబం గురించి చెబుతూ.. నాన్నగారు మా ఊరి నుంచి మొదటి ఆఫీసర్. అమ్మకు చదువు లేకపోయినా పిల్లలను చదివించడానికి చాలా శ్రమించింది. మేం ఈ స్థాయిలో ఉండటానికి కారణం నాన్న కష్టం.. త్యాగం. వారి కుమార్తెగా ఉన్నందుకు ఎప్పటికీ కృతజ్ఞురాలిని అని మీనాక్షి చెప్పింది.






# పీఆర్‌గేమ్‌లోకి నేను ఆలస్యంగా వచ్చా : చైతన్య

టాకీస్: 'తండేల్' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఓ రేడియోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగచైతన్య ఆసక్తికర విషయాలు చెప్పారు. చిత్ర పరిశ్రమలో పీఆర్ యాక్టివిటీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో తమ సినిమాని ప్రమోట్ చేసుకోవడానికి ప్రతిఒక్కరూ పీఆర్‌లను నియమించుకుంటున్నారని అన్నారు. సోషల్ మీడియా వేదికగా మనం చేసే ప్రమోషన్స్ వల్లనే సినిమా ఆడియన్స్‌లోకి వెళుందని అన్నారు. "పీఆర్ గేమ్‌లోకి నేను చాలా ఆలస్యంగా వచ్చాను. సోషల్ మీడియా కూడా అరుదుగా వాడుతుంటా. సినిమా కోసం వర్క్ చేశామా.. ఇంటికి వెళ్లామా.. మన జీవితం మనం చూసుకున్నామా అన్నట్లు ఉంటా. అంతేకానీ నాకు ఈ రాజకీయాలు తెలియవు. నువ్వు ఉన్న రంగంలో రాణించడం కోసం కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. అప్పుడు తప్పదు. గత రెండేళ్లలో పీఆర్ అనేది ఎక్కువైంది. ప్రతి నెలా సుమారు రూ.మూడు లక్షలు ఖర్చు పెట్టకపోతే నువ్వు సరైన దారిలో ఉన్నట్లు కాదు. ఏదైనా సినిమా రిలీజ్ అవుతుందంటే తప్పకుండా పీఆర్ కోసం ఖర్చు పెట్టాలి. సినిమా గురించి ప్రేక్షకులు మాట్లాడుకునేలా చేయాలి. అందులో తప్పు లేదు. కానీ కొంతమంది కావాలని అనవసర ప్రచారాలు చేస్తారు. పక్కనోడిని తొక్కేయడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అది నాకు ఏ మాత్రం అర్థం కాదు. అలా చేయడం కూడా తప్పు. పక్కనోళ్లను ఇబ్బందిపెట్టే బదులు.. ఆ సమయాన్ని మన ఎదుగుదల కోసం ఉపయోగించుకోవడం.. ఆ డబ్బుతో ప్రశాంతంగా ఇష్టమైన విహార యాత్రలకు వెళ్లడం చేయొచ్చు కదా" అని నాగచైతన్య అన్నారు. చందూ మొండేటి దర్శకత్వం వహించిన 'తండేల్' సినిమాలో సాయిపల్లవి కథానాయికగా నటించారు. శుక్రవారం ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. నాగచైతన్య, సాయి పల్లవి నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు.

# ర్యాంప్ వాక్‌తో అదరగొట్టిన రోజా కుమార్తె

టాకీస్: చిత్ర పరిశ్రమలోకి సీనియర్ నటీనటుల వారసులు ఎంట్రీ ఇవ్వడం సర్వ సాధారణమే. అయితే వారిలో చాలా తక్కువమంది మాత్రమే వేరే రంగాల్లో కూడా అడుగుపెడతారు. ఆ విధంగా అక్కడ కూడా తమ టాలెంట్ నిరూపించుకోవాలని చూస్తుంటారు. ఎక్కువగా హీరోల కుమారులు, కుమార్తెలే ఎక్కువగా లైమ్ లైట్ లోకి వస్తుంటారు. ఇటీవల కాలంలో సీనియర్ హీరోయిన్ల కుమార్తెలు సైతం బాగానే పాపులర్ అవుతున్నారు. సీనియర్ నటి, మాజీ మంత్రి రోజా కుమార్తె.. అన్షు కూడా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. అయితే తాజాగా ఈ అమ్మడు మొదటిసారి ర్యాంప్ వాక్ చేస్తున్న ఫోటోలు కుర్రకారు



గుండెల్ని కొల్లగొడుతున్నాయి. ఇప్పటికే రచయితగా తన ప్రతిభను చాటుకున్న ఆమె ఇప్పుడు ఫ్యాషన్ రంగంలోనూ తళుక్కుమంది. నైజీరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎంట్రపెన్యూర్షిప్ ఫెస్టివల్'లో సందడి చేసింది. ఫ్యాషనబుల్ దుస్తులు ధరించి ర్యాంప్ వాక్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ ఫొటోలను తన సోషల్ మీడియా అకౌంట్స్ వేదికగా పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి. టాలీవుడ్ కు మరో హీరోయిన్ దొరికేసినట్టే అంటూ యూత్ అంతా క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.